
# అమ్మ



అన్నపూర్ణమ్మ ఆంతర్యం ఇవ్వాళ సంతోష సముద్రంలో మునిగి తేలుతోంది. ఎప్పుడో గతకాలంలోని మధుర స్మృతులన్నీ మనస్సుని మీటుతూ పులకింప చేస్తున్నాయి.

మళ్లీ తన నలుగురు బిడ్డలకీ ఒక్కసారి తన చేతులతో వండి వడ్డించాలనే తనకోరిక వినేవారి దృష్టిలో స్వల్పమైనదే కావచ్చు. కాని అది ఎంతవిలువనైనదో, అపురూపమైనదో తన మనస్సుకు మాత్రమే తెలుసు.

ఎన్నాళ్ల కెన్నాళ్లకి తన కోరిక అనుకోకుండా నెరవేరుతోందో తలుచుకుంటే కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

అన్నపూర్ణమ్మకు నలుగురు సంతానం. పెద్దవాడు ప్రకాశం. రెండోవాడు శేషగిరి, తర్వాత పుట్టింది పద్మావతి. ఆఖరివాడు శేఖరం.

రుబ్బురోలు దగ్గర కూచుని మసకేసిన జ్ఞాపకాల్లోకి మెల్లగా జారిపోయింది అన్నపూర్ణమ్మ. సినిమా రీళ్లల్లే, తెరలు తెరలుగా తిరిగిపోతున్నా యా జ్ఞాపకాలు ఆమె మనోనేత్రంముందు.

శేఖరం పసివాడుగా వున్నప్పుడు ఒక్క కంచంలోనే కలిపేది నలుగురికీ. పెద్ద వాళ్లు ముగ్గురికీ ముద్దలుచేసి చేతుల్లో పెట్టి శేఖరానికి గోరుముద్దలు నోట కందించేది. అలా దగ్గర కూర్చుని వాళ్లకు కడుపునిండా తినిపించడంలో తనకి సంతృప్తితోపాటు ఒకానొక తీయని మాతృభావన అనుభూతి కొచ్చేది.

ఒక్కొక్కప్పుడు పనిలో వీలుకాక అట్లా పెట్టలేనపుడు తన మనస్సు కెంతో వెలితి అనిపించేది.

పెట్టిన అన్నం కలుపుకోడం చేతకాక సగం కిందా మీదా పోసుకుని ఆఖరికి విసుగొచ్చి, "అమ్మా నువ్వు కలిపిపెట్టవే" అనేవాళ్లు బిడ్డలు, విసుగూ నిస్సహాయతా పెనవేసుకున్న ఆ పసిపాపల మొహాలు చూస్తే అంతపనిలోనూ తనకి నవ్వొచ్చేది. క్షణక్షణం వాళ్లకు తన అండ అవసరం అన్నతలపు ఆదోరకమైన గర్వాన్నీ, ఉత్సాహాన్ని ఇచ్చేది. మమకారం పొంగిపోతుండగా, పిచ్చి సన్నాసుల్లారా నే పెట్టందే అన్నమైనా తినలేనివాళ్లు రేపెలా బ్రతుకుతార్రా' అంటూ అంతపనీ ఒదిలేసి వాళ్ళ నోటికి అన్నంముద్ద లందించేది.

ఆనాడు వాళ్ల కిష్టమైన ఏ చిరుతిండి వస్తువో కాస్త చేతిలో పెడితేచాలు సంతోషంతో వాళ్లమొహాలు వెలిగి పొయ్యేవి. ఈనాడు లక్ష రూపాయలు మూటగట్టి ఇచ్చినా వాళ్ల కళ్లల్లో ఆ ఆనందాన్ని సృష్టించగలదా?

తను అలిగితే ఆదిరి, తను భయపెడితే భయపడి, తను చేరదీస్తే కరిగి, తనులాలిస్తే పడుకొని, తననే పెనవేసుకుపోయిన ఆనాటి వాళ్ల వనిరూపాలు ఇప్పటికీ తన కళ్లముందాడు తున్నాయి.

ఆరోజుల్లో ఒకసారి నెలాఖర్న చేతిలో డబ్బాడక 'ఎస్కర్షన్' కి తండ్రి వెల్లొద్దన్నాడని బిక్కమొహం వేశాడు ప్రకాశం. ఎప్పటినుంచో కంచిపట్టు చీర కొనుక్కోవాలని పైసా పైసా కూడబెట్టి దాస్తున్న డబ్బంతా తీసుకొచ్చి వాడికిచ్చింది తను. ఆనాడు వాడి ఉత్సహంపొంగులో సగం భాగం పంచుకునేటప్పుడు తనకు కలిగిన సంతృప్తి తను ఎన్ని కంచిపట్టుచీరలు కట్టుకుని సాధించగలదా!

మరిఒకసారి శేషగిరి తన కాలేజీ లేబరేటరీలో ఖరీదైన గాజు సామాగ్రి పొరపాటున జారావిడిచాడట. వాటిగ్గాను పైకం జమకట్టాలిసి వచ్చింది, తండ్రిపెట్టే చివాట్లకు జంకుతున్నాడు వాడు డబ్బు విషయంలో మహాకఠినంగా వ్యవహరించేవాడాయన. వాడి స్థితికి జాలేసింది ఎవడో తన జ్ఞాపకార్థం తండ్రి తన వేలికి తొడిగిన మంచి ముత్యపు వుంగరాన్ని ఎవరికీ తెలియకుండా కుదువపెట్టి డబ్బు వాడి చేతికందించింది ఆ రోజున శేషగిరి తనని మాఅమ్మ మంచిది చాలా చాలా మంచిది అంటు పొగడ్తలతో ఆకాశానికెత్తేయటం తను మరిచిపోగలదా!

సరోజా శేఖరం క్లాసుమేట్లు. ఆ పిల్లని ప్రేమించాను. నువ్వేలాగయినా నాన్నతో చెప్పి ఒప్పించమ్మా' అని తనతో మొరపెట్టుకున్నాడు. చండశాసనుడైన తండ్రి ఎదటపడి ఏది చెప్పాలన్నా ముందునించీ పిల్లలందరికి హడలే. తనే సాహసం చేసింది. ఆయన పెట్టే దీవనలన్నీ భరించి, నచ్చచెప్పి, సమాధానపరిచి ఒప్పించినందుకు శేఖరం నోటితో కాకపోయినా, వాడి కళ్లల్లో మెదిలిన కృతజ్ఞతను తను చదువుకోలేదూ?

ఇలాంటివే ఎన్నో తియ్యటి జ్ఞాపకాలు మనస్సుని ఉక్కిరి బిక్కిరి చేసేస్తూ లేని నోపికని తెచ్చిపెడుతున్నాయి తనకీవేళ.

పప్పు నలిగింది. అన్నపూర్ణమ్మ మళ్లీ ఈ లోకంలోకి వచ్చింది.

ముందు గదిలోంచి కూతురు అంటోంది ..."ఎందుకే అమ్మా అంత తతంగం పెట్టుకుంటావు? నువ్వు చెయ్యలేవే అమ్మా! నామాట విను ఒక్కకూరా పచ్చడి చేసి మూరుకో ఇంకేమన్నా కావాలంటే హోటల్‌నించి తెప్పిస్తాలే' అంటోంది.

ఆమె ఇంట్లోకి రాకూడని పరిస్థితి, తల్లి రోగిష్టిది, మొన్నటివరకూ బ్లడ్ ప్రెషర్ ఎక్కువై మంచం దిగలేదు. నాలుగడుగులు వేస్తే నీరసంతో వచ్చి తూలిపోయింది. ఈవేళ ఈ చాకిరితో మళీ ఎక్కడ మూలపడుతుందో అని కూతురి భయం.

అన్నపూర్ణమ్మ నవ్వుకుంది. పిచ్చిపిల్ల దానికేమి తెలుసు? తన నీరసం ఎగిరి చక్కాపోయిందని! ఎప్పటినించో ఇలాంటి రోజుకోసం కలలుగని తీరాజేసి దేవుడిచ్చిన వరంలాంటి ఈ సమయాన్ని చేతులారా వృధా చేసుకుంటుందాతను!

పెద్దవాడికి వుల్లిగారెలంటే ఇష్టం, రెండోవాడు గుత్తివంకాయకూరంటే ప్రాణం పెడతాడు. ఇక శేఖరం ఆవకాయంచేస్తే రెండోవారికి మిగలనివ్వడు.

పద్మపిచ్చిగానీ ఇవ్వన్నీ హోటల్లో దొరుకుతాయా? దొరికినా, తన చేతులతో చేసి ముచ్చట్లు చెబుతూ స్వయంగా వడ్డించి మునుపటిలా ఒక్కసారి ఆ సంతృప్తిని నెమరుకి తెచ్చుకోవాలని కదూ తన ఆశ.

భగవత్సంకల్పం అంటే ఇదే కాబోలు, బ్రతిమలాడినా భంగపడినా ఒనగూడని సరి సందర్భం ఇట్లా అనుకోకుండా సమకూడిందంటే దేవుడిదయే అనుకోవాలి.

మళ్లీ అన్నపూర్ణమ్మ మనస్సు వెనకటి పుటలను తడిమింది.

పెద్దవాడికి ఉద్యోగం రావడం మొదలు తను నలుగురు బిడ్డల్నీ ఒక్కసారిగా కళ్లచూసుకోనేలేదు. ఆఖరికి పెళ్లిళ్లకు గూడా ఒకరువస్తే ఇంకొకరు తనకేదో ఇబ్బంది వచ్చి రాకపోతున్నామని టెలిగ్రాం ఇచ్చేవాళ్లు.

ఉద్యోగాలు, ఆతరవాత పెళ్లిళ్లూ, తన నించి వాళ్లని మరీ దూరం చేశాయి. శేఖరం గూడా పెళ్లి చేసుకుని ఉద్యోగ రీత్యా వేదు ప్రాంతానికి వెళ్లిపోయిన తర్వాత లంకంత కొంపలో తనూ ఆయనా బిక్కుమంటూ మిగిలారు. సందడిగా వుండే ఇల్లు బోసిపోయి నిశ్శబ్దంగా వుండేది. ముందు గదిలో ఆయన, వంటగదిలో తనూ. వెనకటి రోజుల్ని తలుచుకుని నిట్టూరుస్తూ భారంగా కాలం గడిపేవారు. పండగో పబ్బమో వస్తే ఆవంటరి తనం మరీ ఇబ్బంది ముచ్చిడై పీడించేది.

"ఒక్కసారి అందర్ని రమ్మని వ్రాయండి" అని ప్రతి పండక్కి ముందూ ఆయన్ని వే ధించేది. 'పిచ్చిదానా ! వాళ్ల అత్తవారిళ్లకు వెళ్లకుండా ఇక్కడికెలా వస్తారె.... మనం రమ్మనటం కూడా తప్పే" అని తనకేసి జాలిగా చూసి నవ్వేవారాయన.

అలా కాదని మామూలు రోజుల్లోనే ఒకటి రెండుసార్లు అందరినీ రమ్మంటూ ఉత్తరాలు రాయించింది. కాని ఒకరి తరవాత ఒకరు చుట్టపు చూపుగా చూసిపోయారే తప్ప ఒక్కసారి వచ్చి తన కన్నుల పండగ్గా ఇంట్లో మసిలింది లేదు.

కూతురూ, అల్లుడూ కూడా అప్పుడప్పుడూ వస్తూనే వున్నా అందరూ కలిసి కలకల్లాడే నిండుతనం కోసం తను కలవరిస్తూనే వుంది..

ఒకసారి ఆగలేక ఒకసారి కొడుకులకీ, కూతురికీ తన అభిలాష తెలియపరిచి, వచ్చే సంక్రాంతి పండక్కి తప్పకుండా రమ్మని కోరుతూ ఉత్తరాలు తనే రాసింది.

తన మాట తీసేయ్యరన్న నమ్మకంతో సంక్రాంతికి నాలుగు రోజులకు ముందే పండగ పనులకు దిగింది.ఇళ్లూ వాకిళ్లూ కడిగి, గుమ్మాలకి పసుపుకుంకాలు పెట్టి, మామిడి తోరణాలతో అలంకరించింది.

మనుమలచేత బొమ్మలు పెట్టించాలనీ భోగిపళ్లు పోయ్యాలనీ ఏవేవో కోరికలు తీర్చుకోవాలని ఆశిస్తూ ఓపిగ్గా అటకమీద బొమ్మలన్నీ దింపి దులిపింది.

'అందరూ చిన్న సన్నాసులు, ఏమన్నా చిరుతిండి లేకపోతే ఎట్లాగ ! అనుకుంటూ అరిశలు వండింది. కారప్పూస చేసింది. ఉబ్బాల్లో పోసి మూత పెట్టింది.

అన్ని సన్నాహాలూ పూర్తి చేసుకుని కొండంత ఆశతో వాల్లెప్పుడొస్తారా అని ఎదురు చూస్తూన్న తనకు ఆశనిపాతంలా సరోజ రాసిన ఉత్తరం తన ఉత్సాహాన్ని గప్పున చల్లార్చేసింది.

తన చిన్నకోడలు, శేకరం భార్య తననెంత అపార్థం చేసుకున్నదీ!

"దూరంగావున్నా అత్తగారి బుద్ధి పోనిచ్చుకోక అధికారం చెలాయిస్తోందట తను. తనని కన్నవారికి దూరం చేసి చోద్యం చూడాలనుకుంటోందట. పెళ్లి చేశాక గూడా కొడుకుల్ని తన చుట్టూ తిప్పుకోవాలను కోడం అంత మంచిదికాదట! ఇలాంటి అభాండాలే ఎన్నో.

ఆ జాబు ఆయన చదివి వినిపిస్తుంటే, కీళ్లు సడలి పోతున్నట్టూ, గుండె వేగం హెచ్చినట్టూ, సముద్రం పోటెత్తినట్టూ రక్తం ఉవ్వెత్తున పొంగు కొస్తున్నట్టూ అయి తూలిపడబోయింది. రోగమూ రొష్టు లేకుండా ఆరోగ్యంగా తిరిగే కాలంలో తనలో మొదటి సారిగా బలహీనత చోటు చేసుకున్నది, అప్పటినించే.

పెళ్లిళ్లు కాగానే కూతుల్లు, ఉద్యోగాలు రాగానే మగ పిల్లలూ పుట్టిళ్లు వదిలిపోతూ, కూతుళ్లకీ కుడుకులకీ బేదం కనిపించని ఈ రోజుల్లో, కూతుళ్లలాగానే అప్పుడోసారి, ఇప్పుడో సారీ మొహాలు చూపించే కోడళ్ళ మీాద అధారిటీ చెలాయించేటంత మూర్ఖురాలా తను?

ఒకరు కన్న ఆడపిల్ల - నాగడప మెట్టిందికదా అన్న అహంకారంతో పుట్టింటికి దూరం చేసేటంత కర్కోటకురాలా తను? నిజమే శేఖరం పెళ్లయ్యాక ఇది రెండో సంక్రాంతే మొదటి సారి తండ్రి రాసిన మీదట ఇక్కడికే వచ్చారు కాని అప్పుడు పెద్దపిల్లలిద్దరు రానే లేదు. తన భ్రమతా తీరలేదు. అందుకే మళ్లీ ఈ యత్నం చేసింది తను. ఇవన్నీ వివరంగా రాసి మరీ ఆహ్వానించినా కోడలు ఎందుకు అర్థం చేసుకోలేక పోయింది, అంతే ఆ గుణపాఠంతో మరి అందరినీ కలిసి చూడాలనే ఉబలాటానికి స్వస్తి చెప్పి ఆ కోరికని గుప్తంగా తనలోనే దాచుకున్నది. శేఖరం భార్య సరోజకు చిన్నతనం తొందరపాటు అని సర్దిచెప్పుకున్నా తక్కిన కోడళ్లు తక్కువ తిన్నదేమీ లేదు. ఆ తరువాత కూడా అమృతకలశం లాంటి తన మాతృ హృదయంలో విషబిందువులు రాల్చుతూనే వచ్చారు. ఆయన పోయిన తరువాత ఒంటరి పక్షిగా తను ప్రకాశం అండ జేరినప్పుడు దిగులుతో శుష్కించిన శరీరానికి ఎప్పుడో ఏదో సుస్తీ చుట్టుకుంటూనే ఉండేది. నీరసంతో ఎక్కువ పని చేయలేక పోయినా వట్టినే కూర్చునీ వుండలేక పై పై పనులు అందుకుంటూ కోడలికి సహాయం చేస్తూనే ఉండేది. ఒక రోజు వంట చేద్దామని పొయ్యిముందు కూర్చుంది తను. ఉన్నంటుండి విపరీతమైన చలి వెన్నెముక గుండా పైకి గబగబా పైకి పాకినట్టయింది. పళ్లు గడ్డ కర్చుకు పోతున్నాయి. కాళ్ళు తేలి పోయి కళ్లు మూతలు పడిపోతుంటే, తూలి పొయ్యిలో పడకుండా నిగ్రహించుకుని వంటి మీద స్పృహ జారిపోతుండగా ఎలాగో లేచి మంచం మీద ఒరిగింది. మళ్లీ తెలివి వచ్చేసరికి వంటింట్లోనించే కోడలి అరుపులు వినబడ్డాయి, "వంట చెయ్యడం ఇష్టం లేకపోతే తననెవరు వంటింట్లోకి వెల్లమన్నారు. పొయ్యి మీద బియ్యం పడవేసి మంచం ఎక్కి పడుకుంటే ఏమిటర్థం ! వెళ్లే ముందు ఒక్క కేక వేస్తే నేనే చూసుకుందునుగా, నా వని నాకు తప్పుతుందా మాడి బొగ్గయి పోయింది అన్నం. ఒకరిని నమ్ముకోవటం నాదే బుద్ధి తక్కువ. ఆ విసుర్లన్ని తన మీదే అని తెలుస్తూనే ఉన్నాయి.

ఆయనుండగా తననెంతో గౌరవంగా నమ్రతగా చూచిన కోడలిప్పుడు తననెంత నిర్లక్ష్యంగా చూస్తుందో ఏం చెయ్యగలదు తను. పళ్లు గిట్ట కరుచుకుని మాట పైకి రాలేదు. అన్నం మాడ్చడం తనకి మాత్రం సరదానా.

మర్నాటి నించీ మరీ బిగదీసుకున్నది కోడలు. జ్వరం తగ్గినా ఏవనిలోనూ చొరబడనివ్వటం లేదు ఏది అందుకో బోయినా విసురుగా లాక్కొని వద్దులేండి నా తిప్పలేదో నేనే పడతాను మీరు పడుకోండి. "అంటూంది పుల్ల విరిచినట్టు" వుండుండీ తను వినేలా గుణుక్కునేది అందరికీ అన్ని రోగాలునూ కూటి కుండకి తప్ప "అనో" చేసే వాళ్లుంటే సరి నేను మంచమెక్కి సుఖపడుదును అంటూనో "శని పట్టుకుంటే ఏడేళ్లు, నన్ను పట్టుకున్న శని పద్నాలుగేళ్ళులా ఉంది. "అనో సగిసేది మాటలతో చిత్రవధ చేసేది. ఇక లాభం లేదని శేషగిరి కొడుక్కి అన్న ప్రాశన వంకన వాళ్ళింటికి చేరుకున్నది.

అక్కడకు చేరాక తన ఆరోగ్యం కొంత కుదుట పడింది. ఒక దెబ్బ తిన్నది కాబట్టి తల వంచుకుని ఇంటి పనంతా తనే చేసుకు పోయేది అయితేనేమి వచ్చే తుఫాను రానే వచ్చింది.

ముందునించీ రెండో కోడలు దృష్టంతా తన నగల మీాదే ఉన్నదని తను కనిపెడుతూనే వుంది.

అన్నీ తీరిపోయిన తనకి ఆ నగల మీద మోజు లేదు గానీ అవీలేకపోతే తను గుడ్డి

గవ్వకు చెల్లనేమో నన్న భయంతో కోడలి కోరిక గ్రహించీ, గమనించనట్టూరుకున్నది.

ఒకనాడు కోడలు ఏంచేసిందంటే సరదాగా కాసేపు కూతురి మెడలో వేస్తానని తన గొలుసు తీసుకుని ఆ తరవాత గదుస్తనంగా కంసాలిని పిలిపించి నెక్లెస్ చేయమని కంసాలికి తన గొలుసు ఇచ్చి పురమాయిస్తుంటే తను బయట పడక తప్పలేదు.

"నేను బతికి ఉండగా అది నా మెళ్లోనే ఉండనీ అమ్మాయి ఆ తరవాత ఎలాగు అవి నీకు చెందేవే అన్నది తను న్యాయంగానే అనుకున్న పని సాగనందుకు ధుమ ధుమ లాడిపోయింది కోడలు. కంసాలిని పంపేశాక తన మీదున్న కోపాన్ని కూతురి మీదకు మళ్లించి పాపిష్టిదానా నీ మూలాంగా మూలాన్నే ఇవ్వాళ్ల ఇన్ని మాటలు పడ్డానేను అంటూ బాది వదిలిపెట్టింది ఏ పాపం తెలియని ఆ పసి పిల్లని ఆ సమయంలో వారించినా ప్రయోజనం ఉండదని మౌనంగా ఉండిపోయింది తను.

రాత్రి కొడుకుని నిగ్గదీస్తోంది కోడలు. "ఏం నెలల తరబడి ముప్పొద్దులా మేపేందుకు పనికి వచ్చాం గాని ఒక్కపిసరు బంగారం విడవడానికి పనికి రాలేదేం. తన సొమ్మేం ఇక్కడి దాచిపెట్టలేదుగా చచ్చినట్టు పోషించటానికీ నెలకింత అని ఇచ్చి వుండమనండి మీరు చెప్పలేక పోతే నేను చెబుతాను. నాకు భయం లేదు" అంటోంది ఖండితంగా .

నిశ్చేష్టురాలయింది తను ఏమిచ్చి పెరిగారు తన పిల్లలు తన ఇంట మరునాడు శేఖరం ఇంటికి బయులు దేరింది. ముభావంగా వూరుకున్నారు కొడుకూ, కోడలు.

శేఖరం భార్య సరోజ కాలేజ్ చదువులు చదివిన పిల్ల, ఆ అమ్మాయి ఎంత ఎబ్బెట్టుగా అలంకరించుకున్నా ఇల్లు పట్టకుండా సినిమాలని షికార్లని తిరుగుతున్నా తన కెందుకని తామరాకు మీద నీటి బొట్టులా పట్టించుకోకుండా ఉండాలనే ప్రయత్నించింది. కాని తన గ్రహచారం కొద్దీ నోరు జారింది ఒకనాడు ఒక్కనాడయినా ఇంటిపట్టున ఉండరాదా అని మండిపడింది సరోజ తన మీద శేఖరం రాగానే వల వల ఏడున్నా నన్ను తిరుగుబోతువని అంది నీ అమ్మ అని చెప్పింది. మరునాడు తన ఊరికి టిక్కట్టు కొని రైలెక్కించాడు శేఖరం. ముగ్గురు కోడళ్ళు మూడు విధాలుగా చెప్పినా సారాంశం ఒక్కటే నువ్వు మాకు పనికి రావు అని ఇందులో ఎవరినీ తప్పు పట్టేటట్లు తన దురదృష్టాన్ని నిందించుకోవాలే తప్ప వేరే ఇంట పుట్టి తన ఇంట మెట్టిన వాళ్లు కోడళ్లు వాళ్లకు తన మీద ఆపేక్ష లేక పోవడం సహజమే మరీ చిరాకు పరాకు లెరగక, రెక్కలు ముక్కలయ్యేట్టు ఇంత వాళ్లనంతవాళ్ళుగా చేసి తనలోని రక్త మాంసాలతో రూపుదిద్దుకున్న కొడుకులే, పెళ్ళాలు ఈటెల్లాంటి మాటలు విసురుతూ కన్న తల్లిని కానిదానిగా గడప దాటిస్తుంటే మొహాలు తప్పించి ఊరుకోవడమెంత దారుణం.

ఏమిటంత వెర్రిన పడుతోంది తను జీవితాంతం తోడుగా నిలిచేవాళ్ళు భార్యలు.ఇవ్వాళ రేపట్లో రాలిపోయేది తను.

అమ్మని వెనకేసుకురావటం తెలివి తక్కువ అని ఎరగరా వాళ్ళు! పోనీ తన సంగతి వొదిలి పెట్టినా తన రక్తం పంచుకున్న వాళ్లుగదా అన్నదమ్ములు వాళ్ల మధ్య కూడా సఖ్యత లేదే, ఒకరి మాట ఒకరికి నచ్చదు ఒకరిపని ఒకరికి గిట్టదు. ఒకరిపొడ మరొకరికి కంటకం. చిన్నప్పుడు ఒకరి మీద ఈగవాలితే మరొకరి మీద బండ పడినట్టు ప్రాణంలో ప్రాణంగా మసిలిన వాళ్ళు వీళ్ళేనా అని మనసెంతో వ్యధకి లోనవుతుంటుంది.

పద్మావతి ఒక్కతే ఇంక తన కోసం పాకులాడుతుంది. ఒక్కదానివి ఇలా ఒంటరిగా వుంటే ఏ కాలో చెయ్యో నొచ్చితే నిన్ను కని పెట్టే దిక్కెవ్వరు. అని తన ఇంటికి వచ్చే దాకా వదల లేదు. అల్లుడు కూడా యోగ్యుడు. తనని గౌరవంగా చూస్తున్నాడు. భగవంతుడి పిలుపుకోసం ఎదురు చూసే తనకు ఆఖరి రోజులు ఇలా గడిచిపోతేచాలు

గమ్మత్తుగా ఈ వేళ కూతురి కేదో సంబంధం చూడాలని వచ్చిన ప్రకాశము, కోర్టుపని మీద శేషగిరి, ఆఫీసు పని మీద శేఖరము అనుకోకుండా ఇక్కడ కలుసుకోవటం తటస్థించింది. ఎప్పుడో అణగారిపోయిన తన కోరికని జీవం పోసి తట్టి లేపారు. ఇలాంటి సంఘటనలే మనిషికి లేని శక్తిని నింపేది.

లేని సత్తువ తెచ్చుకుని అనుకున్న వన్నీ చేసింది అన్నపూర్ణమ్మ. కలతలన్నీ మరచి తల్లి అభిమానంలో మునిగి తేలారు కొడుకులు. మనసు విప్పి మాటాడుకుంటూ కష్ట సుఖాలు కలబోసుకుంటూ అరమరికల్లేకుండా మసలుతున్న కొడుకుల్ని చూసుకుని తన చిరకాల వాంఛితం నెరవేరినందుకు పొంగిపోయింది అన్నపూర్ణమ్మ.

"ఈ ఉల్లి గారెలు చెయ్యటంలో మా అమ్మ చేతిరుచి మరెవ్వరికీ రాదు బావగారు. అని అగ్గిస్తూ ప్రకాశమూ, మా అమ్మకింకా నా కేది ఇష్టమో గుర్తే అని మెప్పుగా చూసే శేషగిరీ, "మాటలు తరవాత ఆ ఆవకాయ గిన్నె ఇలాతే అమ్మ అని మురిపిస్తూ శేఖరమూ ఆ మాతృదేవతని ఆకాశానికెత్తేశారు. అబ్బే నా బిడ్డలు మారిపోవట మేమిటీ వాళ్లెప్పటికీ నావాళ్లే. అని మురిసిపోయిందావిడ.

అందరి పనులు పూర్తయ్యాయి ఒకేసారి బయలు దేరారు. గమ్యస్థానాలు వేరయినాప్రయాణం చేస్తున్నది ఒకరైలులోనే కాబట్టి ముగ్గరన్న దమ్ములూ ఒక్క కంపార్టుమెంటు లోనే ఎక్కి కూర్చున్నారు.

అమ్మ పక్షపాత వైఖరి చూశావా? గంపెడు పిల్లలతో ఇంటెడుచాకిరీ చేసుకోలేక కొద్దిగా సాయంచేయ్యమంటే లేవలేనని మొండికేసినందుకు గాదూ మీ వదినకి ఒళ్ళుమండి మాటలు మిగిలిందీ ఇప్పుడు కూతురి ఇంటిల్లిపాదికీ ఉస్సురనకుండా పిండి వంటలతో సహా చేసిపెడుతుందే ఆ నీరసమంతా ఏమయిందీ. అని ఎత్తుకున్నాడు ప్రకాశం అక్కడలేని తల్లిని విమర్శిస్తూ.

దానికేంలే, చెల్లాయి ఇంట్లోకి రాకూడదు కాబట్టి తప్పనిసరిగా ఏదో తిప్పలు పడ్డదనుకో అందుక్కాదుగాని నువ్వు చూశావో లేదో అమ్మ మొదలోపెద్ద గొలుసూ చేతి గాజులు, లేవు చూశావా. పసి పిల్ల మారాం పడలేక ఒక్క గొలుసు ఇవ్వండత్తయ్యా. పిల్ల నక్లెస్ అడుగుతోంది అని ముచ్చటగా అడిగినందుకైనా సరే ననకుండా ఇవ్వనని ఖచ్చితంగా కట్టెవిరిచి చెప్పిందనిగాదు మా మరదలుకీ అమ్మకీ ఇంట్లో పొత్తు చెడింది....! కూతురి కయితే కరిగించి కణికెలు కొంగున కట్టెందుకు ప్రాణం ఒప్పింది చాశావా. అన్నాడు శేషగిరి మరో సలాన వేస్తూ.

"కాదులే అన్నయ్య బావ క్యాషియర్ కదా. ఆ మధ్య ఆఫీసులో డబ్బేదో గల్లంతై బావ ఉద్యోగం వూట్టమే కాకుండా జైలు శిక్ష ప్రాప్తిస్తుందేమోనని కంగారు పడుతున్న సమయంలో అమ్మ తన నగలు అడ్డు వేసి ఆదుకుందట అవి విడిపించి తేవాలయ్యా. అని బావ మాటల సదర్భంలో చెప్పాడు. అట్లాంటి ఆపద సమయంలో చూస్తూ ఎలావూరుకుంటుందిలే అది కాదు గానీ అక్క కూతురు వసంత చూశావా వాడెవడో గోపీకృష్ణట అతనితో ఎంత విచ్చల విడిగా రాసుకుంటూ పూసుకుంటూ కబుర్లాడు తోందో విరగబడినవ్వకూడదనీ వాకిట్లో నిలబడగూడదనీ సరోజకు ఆంక్షలు పెట్టి సతాయించుకు తిన్న మనిషి తన మనవరాలి తెంపరితనాన్ని తనని కానట్టు ఎలా తప్పుకు తిరుగుతోందో చూడు. శేఖరం అన్నల్ని మించి పోయాడు.

"వసంతకీ గోపీకృష్ణకీ వచ్చే వేసంగిలో పెళ్ళటలే తాంబూలాలు గూడా పుచ్చుకున్నారట. కారణం వివరించాడు ప్రకాశం.

శేషగిరికి తన విషయంలో తల్లి చేసిన అన్యాయాన్ని తమ్ముడు సమర్ధించటం నచ్చలేదు దాంతో కలహకాండకి నాంది పలికాడు.

"ఆఖరివాడవని ఇంటెడు సామాను నీకు దోచిపెట్టబట్టి నీకు నొప్పి కనిపించలేదు గానీ, అందులో ఆవగింజంతయినా అమ్మ నాకు ముట్టచెప్పిందీ. నేనంత తినదగని వాడినా. అన్నాడక్కసుగా శేషగిరి.

"లేకపోవటమేం. నీకు ఉద్యోగం ఎలా వచ్చిందనుకున్నావే. అయినకాడికి కన్నవారు పసుపు కుంకుమగా ఇచ్చిన ఎకరం పొలమూ నీ ఉద్యోగానికి లంచం పెట్టలేదు అమ్మ. ఎటుగూడీ నాకే మరీ అన్యాయం చేసింది. ఆవిణ్ణించి తమలపాకు తొడిమ ఎరగన్నేను. అన్నాడు ప్రకాశం విచారంగా.

"పాపం అలాగేం వదిన నగకట్టంతా ఎవరిదో నాకు తెలియదనుకున్నావా? ఆ మాటకొస్తే అందరికన్నా ఎక్కువ ముట్టింది నీకే, ఈ రోజుల్లో ఎంతలేదన్నా అయిదారువేలకి లెక్కకొస్తుందా జవహరీ. నేను ఎక్కువ తిన్నట్టు కుళ్లు తావేరా అన్నాడు శేషగిరి మొహంగంటుపెట్టుకుని

నేను కాదురా ఏడుస్తుంది మమ్మల్ని చూసి నువ్వే కండ్లల్లో నిప్పులు పోసుకుంటున్నావు అమ్మ నించి ఎంత పిక్కినా ఇంక నీకూ నీ పెళ్లానికీ ఆశతీరడం లేదు. అమ్మ మీకు బాగానే వాత పెట్టిందిలే అన్నాడు ప్రకాశం రెచ్చెపోతూ.

"నీకు మాత్రం నీతి వుందీ పురిటి పురిటికీ నీ ఇంటికొచ్చి రెక్కలు ముక్కలు అయ్యేట్టు చాకిరీ చేసిందే నాలుగు రోజులు పడకేసింది గావును రోగిష్టి అన్న జాలన్నా లేకుండా వెళ్లగొట్టారు పుణ్యదంపతులిద్దరు ఇది బాగుందా" అన్నాడు శేషగిరి, నాకేదో ఒరగబెట్టిందని గుడిసుళ్లు పడిపోతున్నారు గాని మీరు వేసుకోగా మిగిలిన చిన్న చిదరేగా నాపాల పడింది? పాత బీరువాలూ, రిపేరుకొచ్చినా సాకు, వాల్వు ఒదులైన రేడియో అణాకనీ స్టీలు సామాన్లు అవేగా నాకిచ్చినవి గుండిగలు గంగాళాలు ముందు మీరే దొర్లించుకు పోతిరి." శేఖరం నిష్ఠూరంగా అన్నాడు.

"అవునయ్యా చిల్లులు పడినా రావణా సైజులో గుండిలు, గంగాళాలు, మా కిచ్చింది. అవి అందరి కళ్లా పడినాయి. అవి మాకిచ్చి వెండి కంచాలు, గిన్నెలు, గ్లాసులు చిన్న సైజువి గవ్‌చివ్‌గా నీకిచ్చి సద్దుకోమన్నది. అవునా? అన్నాడు శేషగిరి గడుసుగా.

పరస్పర దూషణా స్వయం సమర్ధనా పరాకాష్ట అందుకున్నాక గెలుపోటములు ఎటూ నిర్ణయం కాకపోయే సరికి తిరిగీ అవిసురు తల్లి మీదకి మళ్లింది. "అసలు అమ్మ మనందర్నీ సమానంగా చూస్తే మనలో మనకి తగవులెందుకు వస్తాయి? ఈసారి కనబడనీ నాలుగు దులపక ఒదులుతానేమో. అన్నాడు ప్రకాశం కళ్లలో కత్తులు నూరుతూ.

"నేను అంతే నాలుగు జాడించి తీరతాను." శేఖరం వంతపాడాడు.

"నేను మాత్రం కడిగెయ్యక ఊరుకుంటానా సవాలు చేశాడు శేషగిరి కసిగా. మొహాలు మట మట లాడిస్తూ కూర్చున్నారు ముగ్గురూ రైలు ఏదో స్టేషన్లో ఆగి తిరిగి బయలుదేరింది. ఉన్నట్టుండి ఎందుకో పెద్ద జర్క్ ఇచ్చింది రైలు. ఆ కుదుపుకి పెట్టెలోని వారందరూ ఒక్కసారిగా ముందుకు తూలి కంగారు పడుతూ తిరిగి సర్దుకున్నారు. అన్నదమ్ములు ముగ్గురి నుదుర్లూ ఎదురు బల్లకు కొట్టుకున్నాయి. బొప్పె తడుముకుంటూ, అప్రయత్నంగా 'అమ్మా' అనుకున్నారు ముగ్గురూ.

ఎదురు సీట్లో కూర్చుని ఇంతదాకా వీరినే గమనిస్తున్న ఓ సాధువు చిరునవ్వు నవ్వాడు. "ఎందుకు బాబూ మళ్లీ తల్లిని తలస్తున్నారు?"

"తెల్లబోయి చూశారు ముగ్గురూ ఆయన వంక".

మీరనుకుంటున్న మాటల్ని బట్టి చూస్తె మీ తల్లి మీకెంతో ద్రోహం చేసిందనిపిస్తోంది. మరి ఈ చిన్న ప్రమాదానికే తబ్బిబ్బయి మళ్లీ ఆవిణ్ణే స్మరించుకున్నారెందుకని? ఆయన కంఠంలో వ్యంగ్యం ధ్వనించింది.

పైకి సిగ్గుపడ్డారు, కానీ లోపల మండి పడిపోయారు ముగ్గురూ. 'వీడికెందుకు మాగోల? తెలిసిన వాళ్లెవరూ లేరుకదా అని ఆవేశంలో గట్టిగా మాట్లాడుకోడం గూడా తప్పయి పోయిందె అనుకున్నారు. గట్టిగా నీకెందుకయ్యా అనడానికి భయం. మామూలుగా అడుక్కుతినే గంజాయి తాగే సాధువులా లేడాయన వాలకం. కాషాయ రంగువైన బట్టలు శుభ్రంగా వున్నాయి. గడ్డాలు మీసాలు వంకీలు తిరిగి అక్కడక్కడ నెరిసి వున్నది. శాంతమూ, గంభీరమూ మూర్తీభవించినట్టున్నాడాయన చేతికి వాచీ ఖరీదైన సూట్‌కేసు ఆయన భుక్తి కోసం బైరాగి అవతార మెత్తిన బాపతుకాదని రుజువు చేస్తున్నాయి చేతిలో అందమైన బైడింగూ బంగారు అక్షరాలతో మెరుస్తున్న అరవిందుని లైఫ్-డి వైన్ భగవద్గీతా పుస్తకాలు ఆయన సాధుత్వాన్నీ జ్ఞానాన్ని చెప్పక చెబుతున్నాయి. మనిషిని చూడగానే ఒకానొక గౌరవభావమూ భక్తీ కలిగించే విధంగా వున్నాడాయన. దానికి తోడు కంపార్ట్‌మెంటులో వున్న మిగతా వాళ్లుకూడా ఆయన మాటల్నె సమర్థిస్తున్నట్టు మెప్పుగా చూస్తున్నారు. తేలు కుట్టిన దొంగల్లా కిక్కురుమనకుండా ఉండిపోయారు ముగ్గురూ.

వాళ్లకే కాక అందరికీ చెప్తున్నట్టుగా ఓసారి చుట్టూ చూసి ఆయన మళ్లీ ప్రారంభించాడు. మనం కష్టాల్లో తలచుకొనేది మనల్ని అత్యధికంగా అభిమానించే వాళ్ళనే నాయనా! అంతేకాని మనం ప్రేమించేవాళ్ళని మాత్రం కాదు గుర్తుంచుకోండి. వాళ్లలో ముఖ్యు లెవరో తెలుసా ? ఒకరు తల్లి, మరొకరు భగవంతుడు. వీరి తరవాతే మరే అప్తులైనా ఆవద నమయంలో న్ధయిర్యాన్ని ప్రసాధించేవాడు భగవంతుడు. వెనకా ముందూ చూడకుండా నిన్నాదుకుని నీకొచ్చిన కష్టం తనదని భావించేదే తల్లి. అందుచేతే అనుకోకుండానే ఆ మాతృమూర్తిని తలుచుకున్నారు మీరు. అది సహజం."

అన్నదమ్ములు ముగ్గుర్నీ ఉక్కిరి బిక్కిరి చేసేస్తు సాగిపోయింది ఆయన వాగ్ధోరణి కంపార్ట్‌మెంటులో వారందరూ కూడా ఆశక్తిగా వింటున్నారాయన ప్రసంగాన్ని.

"ప్రతి మనిషికీ ప్రత్యక్ష దైవం తల్లి, గర్భంలో తొమ్మిది నెలలూ తన రక్తమాంసాలిచ్చి నీ రూపు దిద్దుతుంది. ఇది తల్లి తప్ప ఇతరులెవ్వరూ చెయ్యలేని మహత్తరమైన త్యాగం. అప్పుడే కాదు., నీవు జన్మించిన తరువాత కూడా తన రక్తపు బొట్లను అమృతం వంటి క్షీరంగా మార్చి నీ శరీరానికి పుష్టి నిచ్చే పాడి ఆవుగా మారుతుంది. నీ మల మూత్రాలను సయితం అసహ్యించుకోక శుభ్రపరిచి నీకు దాస్యం చేస్తుంది. ఆజన్మాంతమూ అనుక్షణం నీ క్షేమం కోరుతూ, సదా నిన్ను గూర్చిన ఆలోచనలతో నీకే అంకితమైపోతుంది. ఇంతెందుకు, తన జీవితాన్నే నీచుట్టూరా పరచి నీకు పువ్వుల బాట ఏర్పరచాలని తాపత్రయ పడుతుంది తల్లి.

గుక్క తిప్పుకోడానికి ఆగాడాయన. గంభీరమైన ఆయన వదనంలో సన్నటి బాధా వీచిక ఒక్క క్షణం కదలాడింది. వాళ్లనే ఉద్దేశిస్తున్నట్టు ఆ ముగ్గురివంకా తీక్షణంగా చూశాడాయన.

"అటువంటి త్యాగమూర్తిని తుచ్ఛమైన పెట్టుపోతల గణితంలో లాభనష్టాలు బేరీజు వేసి, లేని పక్షపాతాన్ని ఆపాదించి కించ పరుస్తున్నారంటే అదెంత అమానుషమో గ్రహించలేదామీరు."

చిన్నబోయాయి ఆ ముగ్గురి మొహాలూ ఒక్కసారిగా, జాలిపడ్డా డాయన.తను మరీ కఠినంగా మందలించటం లేదుకదా!

"మనకి సమస్తమూ ధారబోసిన తల్లికి తిరిగీ మీ రక్తమాంసా లిమ్మనీ, మీ భోగభాగ్యాలంటగట్టమని చెప్పను. ఆమె కూడా వాటిని కోరదు. ఆమెకు కావాల్సిందల్లా మనస్పూర్తిగా మీ ఆదరణ., వృద్ధాప్యంలో మీ తోడునీడ, మీ ఆప్యాయత, మీ నుండి ఆశించేది. వాటిని ఆమెకు అందజేసి అంతకు కొంతయినా ఆమె రుణం తీర్చుకోడానికి ప్రయత్నించండని మాత్రమే" ముగించాడాయన.

ముగ్గురూ చేదుమాత్రలు మింగినట్లు, మింగారు ఆయన సుభాషితాలని. అవి ఇమిడాయాన్నది అనుమానమే.

దిగాల్సిన స్టేషన్లు ఒక్కటొక్కటీ వస్తున్నాయి. తప్పనిసరిగా మొహాన చిరునవ్వులు మొలిపించుకుని, లేనిపోని ఆప్యాయతలు చూపించుకుంటూ వీడుకోలు చెప్పుకున్నారు ఒకరి కొకరు.

దిగుతూ పంజరంలోంచి తప్పించుకున్న పక్షుల్లా ఫీలయ్యారు ముగ్గురూ.

అందాకా వీళ్లనీ, సాధువుగారి బోధలనీ శ్రద్ధగా గమనిస్తున్న ప్రయాణీకుడొకరికి సందేహమొచ్చింది.

"వీళ్లు మారతారంటారా?" పక్క ప్రయాణీకుడికి తన సందేహాన్ని వెల్లడించాడు. అజ్ఞానిని చూసినట్టు చూసి నవ్వాడాయన.

"మంత్రాలకు చింతకాయులు రాలుతాయటండీ మీ పిచ్చిగానీ? కుక్కా-దారిగుంటా సామెత వినలేదూ-?" అంటు పేపర్లో మునిగిపోయారు.

రైలు వేగం పుంజుకుంది.

సమాప్తం.......